పదిలో సత్తా చాటిన విద్యార్థులు

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అభివృద్ధికి ప్రతిబింబంగా ఫలితాలు
- పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్దిన అప్పటి ప్రభుత్వం
- ప్రభుత్వ పాఠశాలలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- తల్లికి వందనం హామీకే పరిమితం



100 శాతం ఉత్తీర్ణత సాధించిన ఇందుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు

అమలాపురం రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఈ ఏడాది విద్యార్థులు సత్తా చాటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలోఅధునాతనంగా తీర్చిదిద్దింది. మెరుగైన సదుపాయాలను కల్పించింది. ఉపాధ్యాయులకు క్రమం తప్పకుండా దిశా నిర్దేశం చేసింది. విద్యార్థులకు సకాలంలో విద్యా ఉపకరణాలను అందించింది. తల్లిదండ్రులకు అమ్మఒడి పేరుతో ఆర్థిక సాయం అందించింది. ఐదేళ్లపాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన కృషి నేటి విద్యా సంవత్సరం ఫలితాల్లో ప్రతిబింబించింది.

గత ప్రభుత్వ అభివృద్ధితో ఈ ఏడాది ఫలితాలు

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు ఇలా ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరం దాదాపు కూటమి పాలనలో సాగింది. విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికి వందనం పేరుతో రూ.15వేలు ఆర్థిక సాయం చేస్తామన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా సాయమందించలేదు. పాఠశాలలను అభివృద్ధి చేసిందీ లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలలను మెరుగుపర్చింది. తరగతి గదులను అధునాతనంగా తీర్చిదిద్దింది. ఉపాధ్యాయుల్లోనూ, విద్యార్థుల్లోనూ మనో ధైర్యాన్ని నింపింది. ఆ కృషి ప్రభావంతో పాటు విద్యార్థి ఉపాధ్యాయుల శ్రమ ప్రస్తుత ఫలితాలను ప్రతిబింబించింది. అమలాపురం పట్టణ, రూరల్ మండలంలో ఈ ఏడాది అన్ని పాఠశాలల్లో కలిపి 2,161 మంది పరీక్ష రాయగా మొత్తం 1,940 మంది ఉత్తీర్ణులయ్యారు. 89.77 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అల్లవరం మండలంలో 616కి 570 మంది పాసై 92.53 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉప్పలగుప్తం మండలంలో 551మందికి 541 మంది ఉత్తీర్ణులవగా 98.19 శాతం నమోదైంది. ముమ్మిడివరం మండలంలో 828 మంది పరీక్షలకు హాజరుకాగా 797 ఉత్తీర్ణత సాధించారు. 96.26 శాతం నమోదైంది. ఐ.పోలవరం మండలంలో 732 మంది పరీక్షలకు హాజరుకాగా717 ఉత్తీర్ణులయ్యారు. 97.95 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాట్రేనికోన మండలంలో 593 మంది పరీక్షలకు హాజరు కాగా, 581మంది ఉత్తీర్ణత సాధించారు.

మెరిసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో అమలాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.నాగలాస్య 587 సాధించి ప్రథమ స్థానం. ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థిని టి.హెబ్సిబా 585 సాధించి ద్వితీయ స్థానం, మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఎస్ సూర్య శ్రీనివాస్ 583 సాధించి తృతీయ స్థానం దక్కించుకున్నారు.

ఉప్పలగుప్తం మండలంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి గొల్లవెల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అక్కల జ్యోషికాశ్రీసూర్య, 583 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానం, గనిశెట్టి శేష పద్మవైష్ణవి, 580 మార్కులతో ద్వితీయస్థానం, గనిశెట్టి కరుణ శ్రీసాయి, 573 మార్కులతో తృతీయస్థానం సాధించారు. అల్లవరం మండలంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు ఎస్.జాహ్నవిలక్ష్మి, 587 మార్కులతో ప్రథమస్థానం, ఎస్.శృతి కె.హరిక, 584 మార్కులతో ద్వితీయ స్థానం, కట్టా కుసుమ ప్రియ 577 మార్కులతో తృతీయస్థానం నిలిచారు.

ముమ్మిడివరం మండలంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.అనుష 582 మార్కులు, గాడిలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వీహెచ్ఎస్ ఎస్ సందీప్ 578 మార్కులు, ఎస్వీ రవీంద్ర 576 మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. కాట్రేనికోన మండలంలో కందికుప్ప ఉన్నత పాఠశాల చెందిన బడుగు రక్షిత 582 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం, బేథానీ ఉన్నత పాఠశాలకు చెందిన మట్టపర్తి లక్ష్మి 580 మార్కులు ద్వితీయ స్థానంలో, గచ్చకాయల పోర ఉన్నత పాఠశాలకు చెందిన కె.మైథిలీ తృతీయ స్థానం సాధించారు.

జిల్లా విద్యాశాఖ ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు



ప్రి పబ్లిక్ పరీక్షల్లో మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ఉపాధ్యాయుల కృషితో నూరు శాతం ఫలితాల సాధించాం. పాఠశాల విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించారు.

– విత్తనాల శ్రీనివాసరావు, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్ ఇందుపల్లి, అమలాపురం మండలం

నిరంతర పర్యవేక్షణతో ఉత్తమ ఫలితాలు



పదో తరగతి ఫలితాల్లో అమలాపురం మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఫలితాలు సాధించేలాగా ఉపాధ్యాయులు నిరంతర కృషి చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరీక్షలకు సిద్ధం చేశాం. మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు.

– గుబ్బల సూర్యప్రకాశం, ఇన్‌చార్జి డీవైఈవో, అమలాపురం

క్లుప్తంగా

వైభవంగా రామానుజాచార్యులు జన్మదినోత్సవం



రామానుజాచార్యుల చిత్రపటానికి పూజలు చేస్తున్న సంఘ సభ్యులు

అమలాపురం టౌన్: అమలాపురం వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం, ఉత్సవ కమిటి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వాసవీ ఫంక్షన్ హాలులో భగవత్ రామానుజాచార్యుల 1008వ తిరు నక్షత్రం (జన్మ దినోత్సవం) సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత రామానుజాచార్య స్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. వైశ్య సంఘం నాయకుడు, రామానుజదాసుడు వరదా సూరిబాబు మాట్లాడుతూ రామానుజాచార్యుల జీవిత చరిత్ర, మహిమల గురించి భక్తులకు వివరించారు. వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన్న వీరన్న పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



సాయమందిస్తున్న ఎంపీడీఓ వెంకటాచార్య తదితరులు

ముమ్మిడివరం : విపత్కర పరిస్థితులలో బాధితులను ఆదుకోవడం అభినందనీయమని ఎంపీడీఓ తాడి వెంకటాచార్య అన్నారు. మండలంలో ఠానేల్లంక శివారు బలుసులంకలో గత నెల 24న చిన్నం ప్రసాద్‌కు చెందిన తాటాకిల్లు దగ్ధమై సర్వం కోల్పోయారు. బాధిత కుటుంబానికి పీపుల్స్ ఆర్గనైజేషన్ సభ్యులు సమకూర్చిన రూ.5వేలు చెక్కు, వంట సామాగ్రిని ఎండీపీఓ వెంకటాచార్య ,ఆల్ ఇండియా ఓఎన్జీసీ సంస్థ ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘ కార్యదర్శి రవీంద్ర చేతుల మీదుగా శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు, సంస్థ సభ్యులు సీహెచ్ శ్రీనివాసరావు, జీవీ సత్యనారాయణ, కేబీవీ కిశోర్, సీహెచ్ వెంకట సుధీర్ పాల్గొన్నారు.

బాలికలపై శ్రద్ధ చూపాలి



చల్లపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ జయమణి, సిబ్బంది

ఉప్పలగుప్తం: కౌమార దశలో ఉన్న బాలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని సర్పంచ్ ఇసుకపట్ల జయమణి అన్నారు. మండంలోని చల్లపల్లి పంచాయితీ పరిధిలో సర్పంచ్ జయమణి ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు కిశోరి వికాశం -2 పై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 11 నుంచి 18 వయస్సు గల బాలికలకు ప్రత్యేక అవగాహనలు కల్పించి వారు సాధికారత వైపు అడుగులు వేసేలా చూసుకోవాలని, బాల్యవివాహాలను అరికట్టాలని సర్పంచ్ జయమణి సూచించారు.

నీట్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలించిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఆదివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగే నీట్ పరీక్ష ఏర్పాట్లను శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి పరిశీలించారు. పరీక్ష గదులను, సిటింగ్ ఏర్పాట్లను, అభ్యర్థులకు తాగునీటి వసతి, భద్రతా ఏర్పాట్లు తదితరమైన వాటిని పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎస్.శరత్‌చంద్ర కీర్తిని పరీక్షకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన 134 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు.

బీమా సొమ్ము అందజేత

యానాం: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన ద్వారా మంజూరైన బీమా సొమ్మును శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి బాధిత కుటుంబానికి అందజేశారు. కురసాంపేటకు చెందిన పాలెపు దుర్గాభవాని గత ఏడాది సెప్టెంబర్ 13న ఇంటివద్ద చీరకు నిప్పు అంటుకోవడంతో జరిగిన ప్రమాదంలో మృతిచెందింది. గ్రూప్ ఇన్సూరెన్స్ సొము రూ.5లక్షలు విలువ చేసే పత్రాలను మృతురాలి కుమార్తె చిప్పల గాయత్రి ప్రణీతకు అందజేశారు. మత్స్యశాఖ ఏడీ గొంతియ్య పాల్గొన్నారు.

తాగునీరు అందించకపోతే మరణమే శరణ్యం



సన్నవిల్లిలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: నిత్యావసరాలలో ప్రధానమైన తాగునీరు అందించటంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని, తాగునీరు అందించకుంటే మరణమే శరణ్యమని సన్నవిల్లి గ్రామస్తులు ఆవేదన చెందారు. మండలంలోని సన్నవిల్లి గ్రామ పంచాయతీ పరిధి పెదచెరువు గట్టు దళిత ప్రాంతంలో గత వారం రోజులుగా తాగునీటి సౌకర్యానికి అంతరాయం ఏర్పడటంతో శుక్రవారం గ్రామస్తులంతా ఖాళీ బిందెలతో నిరసన చేపట్టి, ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి తన సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు మంచి జరుగుతుందన్న మాయలో పడి ప్రజలు గెలిపిస్తే కనీసం తాగునీరు అందిచడంలో సైతం ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. వారం రోజులుగా మంచినీరు లేక గొంతెండిపోతుంటే ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్య వైఖరి చూపిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ ప్రాంతానికి రెండు పూటలా ట్యాంకర్లతో తాగునీటిని సప్‌లై చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు పోలినాటి వెంకటేశ్వరావు, కె.సత్యసుబ్రహ్మణ్యేశ్వరరావు, కె.త్రిమూర్తులు, తాళ్ల భీమేశ్వరరావు, కాశీ మంగాయమ్మ, పోలినాటి మంగాయమ్మ, గోడి లావణ్య తాళ్ల దుర్గాభవాని ఉన్నారు.

చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



బెలూన్‌లు వదిలి సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తాళ్లరేవు: చిల్డ్రన్స్‌క్లబ్ తాళ్లరేవు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంపు-2025 శుక్రవారం ప్రారంభమైంది. ఈ క్యాంపును ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుపూడి శివనారాయణ బెలూన్లను గాల్లోకి వదిలి ప్రారంభించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగులు, ప్రజా సంఘాల భవనాలలో పదిరోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను ప్రతినిధి మల్లేశ్వరరావు వివరించారు. చిన్నారులకు పలు ఆటలు, పాటలతో పాటు విజ్ఞానానికి సంబంధించి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

అంబేడ్కర్ తీర్థయాత్ర పథకానికి నిబంధనలు

యానాం: పుదుచ్చేరి నుంచి మహారాష్ట్ర వెళ్లేందుకు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ తీర్థయాత్రా పథకానికి సంబంధించి నిబంధనలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్‌ను శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వం ఆదిద్రావిడ శాఖ విడుదల చేసింది. ప్రతి ఏడాది యానాం నుంచి -4, పుదుచ్చేరి-32, కారైకల్-12, మాహే- 2 ఆ విధంగా మొత్తం 50 మంది తీర్థయాత్రలో భాగంగా అంబేడ్కర్ స్వరాష్ట్రమైన మహారాష్ట్రలో ఆయనకు సంబంధించిన ముఖ్య ప్రదేశాలను 8 రోజులపాటు దర్శిస్తారన్నారు.

ఈ యాత్ర చేయాలనుకునేవారు ఎస్సీ, ఎస్టీలై ఉండాలని, పుదుచ్చేరి నివాస సర్టిఫికెట్ ఉండాలని, వార్షిక ఆదాయం రూ.2లక్షల లోపు ఉండాలని, వయస్సు 18 ఏళ్లు ఉండాలని తెలిపారు. తీర్థయాత్ర చేసేవారికి వసతి, ఉచిత ఆహారం తదితర ఏర్పాట్లు కల్పిస్తారన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మాడుగుల నాగఫణి శర్మ, తదితరులు

అమలాపురం రూరల్: కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో మూడు రోజుల పాటు జరిగే దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎండీ కె.రవికిరణ్ వర్మ శేషపవిత్ర దంపతులు దీక్షాధారణ చేసి స్వామి వారిని పెండ్లి కుమారుని, దేవేరులను పెండ్లి కుమార్తెలను చేసి అర్చనలో పాల్గొన్నారు. సంకల్పం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనాలు అంకురార్పణ, వాస్తు హోమం, ధ్వజారోహణ కార్యక్రమాలు, ప్రత్యేక అర్చనలు జరిపారు.

భగవంతుడి ఆరాధనలో మానసిక ప్రశాంతత

భగవంతుడి ఆరాధనలో మానసిక ప్రశాంతత ఉంటుందని ప్రవచన సార్వభౌమ మాడుగుల నాగఫణి శర్మ అన్నారు. కిమ్స్ కళాశాల్లో శుక్రవారం ఆయన ప్రవచనం సాగింది. తెలుగు భాషను కాపాడాలని అన్నారు.

డీఎస్సీపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అమలాపురం టౌన్: జిల్లా యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ హాలులో డీఎస్సీ -2025పై అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డీఎస్సీ రాయనున్న 500 మంది అభ్యర్థులకు అవగాహన కల్పించారు. జనరల్ నాలెడ్జ్, సమీకాలీన అంశాలపై, సబ్జెక్టు ఆధారిత అంశాలపై, సైకాలజీలో ఏ విధంగా ప్రశ్నలు అడుగుతారో ఆయన వివరించారు. అనంతరం సైకాలజీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతి బసు, జిల్లా గౌరవాధ్యక్షుడు పెంకే సత్యనారాయణ పాల్గొన్నారు.

12న మాలల మహారణ భేరి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

తాళ్లరేవు: ఈ నెల 12వ తేదీన కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల మహారణభేరి సభను జయప్రదం చేయాలని దళిత నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద మాలల మహా రణభేరి పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ పీవీ రావు 73వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాలలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. దళిత నాయకులు కన్నీడి వెంకట రమణ, కుసుమ శ్రీనివాస్, జక్కల ప్రసాద్‌బాబు, నేతల నాగార్జున, దడాల బుజ్జిబాబు, వడ్డి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



జి.వేమవరంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల పూజల్లో పాల్గొన్న మహిళలు

తాళ్లరేవు: జి.వేమవరం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల ఒకటిన ప్రారంభమైన ఈ ఉత్సవాలు శనివారం వరకు జరుగుతాయి. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం గోపూజ, దీక్షా హోమాలు, క్షీరాధివాసం, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరిపించారు. శనివారం ఉదయం 10.08 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం అన్నదానం నిర్వహిస్తామని ధర్మకర్త యర్రంనీడి నాగేశ్వరరావు, గుడి స్థలదాత లెంక రామన్నపాత్రుడు దంపతులు తెలిపారు.

భవన నిర్మాణ అనుమతులకు హెల్ప్ డెస్క్

అమలాపురం టౌన్: ప్రజలు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే భవన నిర్మాణ అనుమతులను త్వరగా పొందేందుకు అవకాశం ఉంటుందని అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కొత్త విధానం, జీవో, మార్గ దర్శకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం, మున్సిపాలిటీ నుంచి లైసెన్స్ పొందిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్లు, సర్వేయర్లు, ఇంజినీర్ల ద్వారా గ్రామ కంఠం, అధికార లే అవుట్స్, సర్క్యులేషన్ ప్యాటర్న్ మొదలైన ప్రాంతాల్లో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతులు పొందాలని కమిషనర్ రాజు సూచించారు.

సోమాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సోమాలమ్మ

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో వేంచేసి ఉన్న సోమాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. శైవాగమ అర్చకులు భైరవభట్ల వెంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు చేసి, సోమాలమ్మను అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి నైవేద్యాలు చెల్లించారు. అనంతరం నాగులపల్లి పాపయ్యరాజు సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. జాతర ఉత్సవాలు మరో నాలుగు రోజులపాటు జరుగుతాయని కమిటీ సభ్యులు వెల్లడించారు.

అంకితభావంతో చేసిన సేవలకు గుర్తింపు



సత్యనారాయణను సన్మానించి క్రీస్తు ఫొటోను అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ఉద్యోగ కాలంలో ప్రజలతో మమేకమై అంకితభావంతో అందించిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గోడిలోని గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేసిన పడమటి సత్యనారాయణకు శుక్రవారం సన్మానం నిర్వహించారు.

ఎమ్మెల్సీ మాట్లాడుతూ గోడిలోని గ్రంథాలయంలో 20 ఏళ్లుగా విశేష సేవలు అందించి గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత సత్యనారాయణ, విజయలక్ష్మీ దంపతులను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ శాలువాలతో సత్కరించారు. గ్రంథాలయాధికారి సత్యనారాయణ, రుద్రరాజు సత్యనారాయణరాజు, గజపతివర్మ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కలెక్టరేట్ వద్ద సమ్మెలో భాగంగా ఐదవరోజు శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు పి. మమత జ్యోతి, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఏ. సాయిశంకర్, జిల్లా కార్యదర్శి,కె. సాయి తేజలు ఆధ్వర్యంలో పలు మండలాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా ఆందోళనలో భాగంగా మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు.

పెంటకాలువలతో ఆందోళన



ఎన్.కొత్తపల్లిలో పంట కాలువ దుస్థితి



మురమళ్ల-ఎదుర్లంక పంట కాలువలో వ్యర్థాలు

ప్రక్షాళన చేయాలని కోరుతున్న జనం

ఐ.పోలవరం: డెల్టా పంట కాలువలను అధికారులు మూసివేశారు. ప్రధాన పంట కాలువలతోపాటు వాటికి అనుబంధంగా ఉన్న కాలువలు, చానల్స్‌లో కూడా నీరు నిలిచిపోయింది. పంట కాలువలను ప్రక్షాళన చేయడానికి ఇదే మంచి సమయం అని ప్రజలు కోరుతున్నారు.

ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో బొబ్బర్లంక – అమలాపురం, అమలాపురం- చల్లపల్లి, అమలాపురం- అల్లవరం, బొబ్బర్లంక- పల్లంకుర్రు, అయినాపురం- మురమళ్ల, ఇంజరం ప్రధాన పంట కాలువల ద్వారా సాగు, తాగునీరు అందుతోంది. అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీతోపాటు అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం, ఐ.పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, తాళ్లరేవు మండలాల్లోని తాగునీటి పథకాలకు ఈ కాలువల ద్వారానే తాగునీరు అందుతోంది. అయితే బొబ్బర్లంక నుంచి శివారు వరకు ప్రధాన పంట కాలువలు కాలుష్య కాసారాలుగా మారాయి. ఇళ్ల నుంచి హోటళ్లు, ఇతర కమర్షియల్ భవనాల నుంచి, ఆక్వా రొయ్యల కొనుగోలు కేంద్రాల నుంచి మురుగునీరు, వ్యర్థాల నీరు పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ కాలువల్లోకే వదిలేస్తున్నారు. సెప్టిక్ ట్యాంకు గొట్టాలను సైతం కాలువల్లోకి నేరుగా వదిలేస్తున్నారు. పలుచోట్ల చెత్తను కూడా వేస్తున్నారు. అమలాపురం మున్సిపాలిటీతోపాటు పలు పంచాయతీల డంపింగ్ యార్డులన్నీ పంట కాలువలను ఆనుకుని ఉన్నాయి. వీటి వల్ల పంట కాలువలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. చనిపోయిన జంతువులు, కోళ్ల వంటి కళేబరాలను సైతం పంట కాలువల్లో పడేస్తున్నారు. కాలువల నీటిలో రసాయనాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. కాలువ ద్వారా మంచినీటి పథకాలకు అందే నీటిని ఫిల్టర్, క్లోరినేషన్ చేసినా పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా లేకుండా ఉంది. పంచాయతీలలో అయితే క్లోరినేషన్ అనేది నామ్‌కే వాస్తే అన్నట్టుగా జరుగుతోంది. వీటి ద్వారా అందే నీరు తాగి కూడా జనం రోగాలబారిన పడుతున్నారు.

ఇదే అదను

పంట కాలువలను మూసివేసినందున వ్యర్థాలు వేస్తున్న ప్రాంతాలను, అక్రమం ఇళ్ల, హోటల్స్ నుంచి ఏర్పాటు చేసిన పైప్‌లను గుర్తించేందుకు వీలు దొరుకుతుందని స్థానికులు చెబుతున్నారు. వాటిని గుర్తించి నిలువరించడం ద్వారా పంట కాలువలను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు. కాలువల్లోకి పైపులు వదిలేవారిని గుర్తించి వారికి నోటీసులు ఇవ్వాల్సి ఉంది. మరీ ముఖ్యంగా తాగునీటి పథకాలకు నీరు వెళ్లే కాలువలను తక్షణం బాగు చేయాలని వారు కోరుతున్నారు. లేకపోతే ముందు ముందు కాలువల్లో మరింత కాలుష్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.